RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 24 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 278 | పేజీలు : 4 | వెల : 5/-

## ఇంటగ్రేటెడ్ స్కూల్స్ దిశగా అడుగులు



3లో

# కారణం ఉందా..?



- ఎన్నికల ముంగిట ఆయుధాల కొనుగోలు
- రూ.85వేల కోట్లు విడుదల చేసిన కేంద్రం
- సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ కవ్విస్తున్నాయా?
- యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయా..?
- కేంద్రం తీరుపై తలెత్తుతున్న అనుమానాలు

భారత ప్రభుత్వం ఏదో చేస్తోంది. రహస్యంగా ఏదో ప్రిపరేషన్ జరుగుతోంది. అత్యవసరంగా రూ.85 వేల కోట్లను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయుధాల కొనుగోలుకు రిలీజ్ చేసింది. అంటే ఏ దేశమైనా(పాకిస్తాన్, చైనా) భారత్‌పై ఏమైనా దాడి చేయబోతున్నదా? అందుకోసమే భారత్ అత్యవసరంగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్నదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

2లో

- న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు



## తుపాల్!

- డీఎస్సీ గత నోటిఫికేషన్ రద్దు
- సిద్ధమవుతున్న కొత్త జాబితా
- మరిన్ని పోస్టులు చేరే ఛాన్స్
- త్వరలో మరో నోటిఫికేషన్?
- 16 డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూ-స్తున్న అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించబోతోంది. గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ మరికొన్ని పోస్టులను కలుపుతూ కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. కొత్త నోటిఫికేషన్ ద్వారా దాదాపు 11 వేల టీచర్ పోస్టులను భర్తీచేసే అవకాశం ఉంది. ఇటీవలే గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దుచేసి గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాగా డీఎస్సీని కూడా రద్దుచేసే యోచనలో రేవంత్ ప్రభుత్వం ఉంది.గత ప్రభుత్వం 5089 పోస్టులతో డీఎస్సీ-2023 నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. వీటిలో ఎస్‌జీటీ - 2,575 పోస్టులు; స్కూల్ అసిస్టెంట్

మిగతా 2వ పేజీలో...



# 27 నుంచి గ్యాస్, కరెంట్

- మరో రెండు హామీలకు సర్కారు సిద్ధం
- సమ్మక్క జాతరలో సీఎం రేవంత్ ప్రకటన
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక చేత ప్రారంభం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో మరో రెండు గ్యారెంటీల అమలుకు తేదీ ఖరారు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ నెల 27 నుంచి ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రియాంక గాంధీ చేతులు మీదుగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు చేసేందుకు మేడారం వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27 వ తేదీ సాయంత్రం రెండు గ్యారెంటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ రెండు గ్యారెంటీలు ప్రారంభానికి ముఖ్య అతిధిగా హాజరవుతున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరవుతారని

మిగతా 2వ పేజీలో...





# ఎమ్మెల్యే నందిత మృతి

- పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదంలో దుర్మరణం
- దివంగత ఎమ్మెల్యే సాయన్న ఇంట తీవ్ర విషాదం
- వెంటాడిన మృత్యువు.. రెండుసార్లు తప్పించుకున్న నందిత
- మూడోసారి యాక్సిడెంట్ రూపంలో కబలించిన మృత్యువు



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె దుర్మరణం చెందారు. ఓఆర్ఆర్‌పై బారికేడ్లను ఆమె కారు ఢీకొని ప్రమాదం సంభవించింది. డ్రైవర్ తీవ్రగాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. నందిత దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు. ఇటీవలి ఎన్నికల్లో కంటోన్మెంట్

మిగతా 2వ పేజీలో...

# ధరణి.. ఉద్ధరణ!

- రెవెన్యూ పోర్టల్‌లో పూర్తి మార్పులు
- రేవంత్ సర్కారు తాజాగా నిర్ణయం
- నేడో, రేపో క్లారిటీ వచ్చే అవకాశం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ధరణి కమిటీ ఈ నెల 24న కలెక్టర్లతో సమావేశం నిర్వహించనుంది. ఇందు కోసం ఆరు ప్రధాన అజెండాలు సిద్ధం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు

మిగతా 3వ పేజీలో...

DHARANI
Integrated Land Records Management System

## హైదరాబాద్‌లో వాహనాలపై ఆంక్షలు

- 2వ పేజీలో..

## పెళ్లి కోసం యువకుడి కిడ్నాప్

- 3వ పేజీలో..

## పలువురు ఐపీఎస్‌ల బదిలీలు

- 4వ పేజీలో..

## బైజూస్‌కు ఆగని కష్టాలు

- 4వ పేజీలో..

# కరీంనగర్‌లో కారు వర్సెస్ ఖాకీ



- బీఆర్ఎస్ నేతల భూదందాలపై నజర్
- ఆక్రమణల పర్వంపై రియల్ ఆపరేషన్
- ఇప్పటికే పలువురు గులాబీ నేతలపై కేసులు
- కబ్జాదారుల్లో నెలకొన్న భయాందోళనలు

కరీంనగర్, ప్రభాతసూర్యుడు : కరీంనగర్‌లో పోలీసులు పవర్ చూపుతున్నారు. భూ మాఫియా భరతం పడుతున్నారు. దీంతో భూకబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలు వరుసగా జైలుబాట పడుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలు పదేళ్ల అధికారం అడ్డుపెట్టుకుని సాగించిన భూ కబ్జాలపై చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వం మారడంతో బీఆర్ఎస్ బాధితులు పోలీస్ స్టేషన్లకు క్యూ కడుతున్నారు. పదేళ్ల తాము అనుభవించిన నరకాన్ని

మిగతా 3వ పేజీలో...

# మార్చిలో మహాసంగ్రామం

- పార్లమెంట్ ఎన్నికలకు ఈసీ కసరత్తు
- 13 తర్వాత షెడ్యూల్ విడుదలకు సిద్ధం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ని మార్చి 13 తరవాత విడుదల చేసే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంది. ఈసీ బృందం పలు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తోంది. ఈ ప్రక్రియంతా పూర్తైన వెంటనే షెడ్యూల్ విడుదల చేయనుంది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం బృందం తమిళనాడులో పర్యటిస్తోంది. ఆ తరవాత యూపీ, జమ్ముకశ్మీర్‌లో పర్యటిస్తుంది. మార్చి 13లోగా ఈ పర్యటనలు ముగించుకుని ఆ వెంటనే పోలింగ్ తేదీలు విడుదల చేసేందుకు ప్లాన్ చేసుకుంటోంది. కొద్ది రోజులుగా అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులతో వరుస భేటీలు నిర్వహించింది ఈసీ. పలు ప్రాంతాల్లోని సమస్యలు, ఈవీఎమ్‌లు తరలించేందుకు ఎదురయ్యే సవాళ్లు, ఇతరత్రా భద్రతా పరమైన సమస్యలపై చర్చించింది. నిఘా పెంచాలని అధికారులను ఆదేశించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్,




మిగతా 2వ పేజీలో...



## సమ్మక్కకు తీరని సర్కారు మొక్కు!

- జాతర సమయంలోనే జ్ఞాపకం
- బంగారం మొక్కుకు రక్షణ కరువు
- ప్రతిపాదనల్లోనే కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు
- వచ్చే జాతరకైనా మొక్కు తీరేనా..?

సమ్మక్క-సారలమ్మకు భక్తులకు సమర్పించే ఎత్తు బంగారాన్ని గద్దెల వద్దకు సురక్షితంగా చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కన్వేయర్ బెల్ట్ ప్రతిపాదన మాటలకే పరిమితమైంది.

3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మేడారంలో జనజాతార



**వరంగల్,ప్రభాతసూర్యుడు :** ఆసియాలో అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ జాతర. మేడారం జాతర మూడో రోజుకు చేరుకుంది. వనాలను వీడి జనాల మధ్యకు వచ్చిన వన దేవతలను దర్శించుకోవ డానికి సెలబ్రెటీలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు దర్శించు కోవడానికి చేరుకుంటున్నారు. తాజాగా గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అమ్మవార్లను దర్శించుకు న్నారు. గవర్నర్ తమిళి పై కు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘన స్వాగతం పలికారు. సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తన బరువు తులాభారం వేసి నిలువె త్తు బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించారు గవర్నర్. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జాతరకు హాజరయ్యారు.

# కారణం ఉందా..?

- ఎన్నికల ముంగిట ఆయుధాల కొనుగోలు
- రూ.85వేల కోట్లు విడుదల చేసిన కేంద్రం
- సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ కవ్విస్తున్నాయా?
- యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయా..?
- కేంద్రం తీరుపై తలెత్తుతున్న అనుమానాలు




**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** భారత ప్రభుత్వం ఏదో చేస్తోంది. రహస్యంగా ఏదో ప్రిపరేషన్ జరుగుతోంది. అత్యవసరంగా రూ. 85 వేల కోట్లను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయుధాల కొనుగోలుకు రిలీజ్ చేసింది. అంటే ఏ దేశమైనా(పాకిస్తాన్, చైనా) భారత్‌పై ఏమైనా దాడి చేయబోతున్నదా? అందుకోసమే భారత్ అత్యవసరంగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్నదా అన్న సందేహాలు వ్యక్తముతున్నాయి. భారత్, పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో ఒకవైపు ఉద్రిక్తత కొనసాగుతోంది. మరోవైపు పాకిస్తాన్‌లో అల్లకల్లోలం కొనసాగుతోంది. మొన్నటి పాకిస్తాన్ ఎన్నికల్లో ఇమ్రాన్‌ఖాన్ పార్టీ మద్దతుదారులు గెలిచారు. కానీ నవాజ్‌షరీఫ్, భుట్టో వాళ్ల పార్టీ పొత్తుతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాయి. దీంతో సివిల్ వార్ తప్పదన్న వార్తలు వస్తున్నాయి. మరోవైపు సైన్యం కూడా తిరుగుబాటు చేస్తుందని ప్రచారం జరుగుతోంది. పాకిస్తా-న్‌లో మరోవైపు ప్రజల తిరుగుబాటు కొనసాగుతోంది. చాలా రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గిల్గిస్తాన్, బెలుచిస్తాన్ ప్రాంతంలో ప్రజలు ఇప్పటికే పాలకులపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు వివిధ సంస్థలు కూడా తిరుగుబాటు ఆలోచనలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు తాము కశ్మీర్‌లో కలుస్తామని డిమాండ్ చేస్తున్నారు. బెలుచిస్తాన్, బాల్టిస్తాన్ ప్రాంతంలో కూడా భారత్‌లో కలవాలన్న ఆలోచన మొదలైంది. ఇదిలా ఉంటే.. కేంద్రం పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆయుధాలు కొనుగోలు చేయడం, అదీ అత్యవసరంగా కొనుగోలు చేయడం చర్చ-నీయాంశమైంది. పాకిస్తాన్ కోసమే కేంద్రం మరోమారు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నికల ముందే సైన్యం కొన్ని యుద్దాలు చేసింది. ఈ క్రమంలో మోదీ సర్కార్ మరేదైనా ప్లాన్ సిద్ధం చేస్తుందా అన్న చర్చ జరుగుతోంది.

# సిటీలో వాహనాలపై ఆంక్షలు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి ఏపీ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోకి వచ్చే భారీ వాహనాల రాకపోకల్ని పూర్తిగా నిషేధించారు. అనుమతి ఉన్న వాహనాలకు సైతం నిర్ణీత సమయాలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రైవేటు బస్సులు రాత్రి 10 తర్వాత మాత్రమే సిటీలోకి ప్రవేశించాలి. అలాగే ఉదయం 8 గంటలలోగా ఆ బస్సులు నగరం బయటకు వెళ్లిపోవాలని సూచించారు. నగరంలో ఉన్న రహదారులను రూట్లుగా పోలీసులు విభజించారు. వీటిలో కొన్నింటిలో కొన్ని రకాలైన వాహనాలను నిషేధించడం, నిర్దేశిత సమయాలు కేటాయించడం చేశారు. ఈ మార్గాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆయా వాహనాలు ప్రయాణించాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన కమర్షియల్ వాహనాలు నగరంలోకి ప్రవేశించడాన్ని పూర్తిగా నిషేధించారు. లోకల్ లారీలతో పాటు నిర్మాణ సామాగ్రి తరలించే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన వాహనాలు రాత్రి 11 - ఉదయం 7 గంటల మధ్య మాత్రమే నగరంలో సంచరించాలి. డీసీఎం, ఐచర్, స్వరాజ్ మజ్దా వంటి మధ్య తరహా గూడ్స్ వాహనాలు 3.5 టన్నులు, 12 టన్నుల మధ్య బరువుతో కూడినవి మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు, రాత్రి 9 నుంచి - ఉదయం 8 వరకే మాత్రమే తిరగాలి. ప్రైవేట్ బస్సులు కేవలం రాత్రి 10 నుంచి ఉ. 8 గంటల మధ్యనే నగరంలో ప్రయాణించాలి. అత్యంత నెమ్మదిగా నడిచే కేటగిరీకి చెందిన చేతితో తోసే బళ్లు, వివిధ రకాలైన జంతువులు లాగే బళ్లు, సైకిల్ రిక్షాలు, ట్రాక్టర్లు తదితరాల సంచారాన్ని నగరంలోని కీలకమైన 61 రూట్లలో నిషేధించారు. భవన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించే వాహనాల్లో 2 నుంచి 6 టన్నుల మధ్య బరువు కలిగినవి ఉ. 11.30 నుంచి సాయంత్రం 5, రాత్రి 10 నుంచి ఉదయం 9 మధ్య సంచరించాలి. వీటిలో 10 టన్నులు అంతకంటే ఎక్కువ బరువుతో కూడిన వాహనాలు కేవలం రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల మధ్య మాత్రమే నగరంలో సంచరించాలి.





హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా నూతనం గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ మరియు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్ లను పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంగ్ర అనురాధ సురేష్, మోతే మనెమ్మ రామలింగంలు పాల్గొన్నారు.

\- ప్రభాతసూర్యుడు, అబ్దుల్లాపూర్ మెట్

# ఎమ్మెల్యే నందిత మృతి

మొదటిపేజీ తరువాయి..

నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

**వెంటాడిన మృత్యువు**

నందితను మృత్యువు కొంతకాలంగా వెంటా డుతూ వస్తోంది. గతంలో లిఫ్ట్‌లో ఇరుక్కు న్నారు. ఆ ప్రమాదం నుంచి బయటపడ్డారు. మళ్లీ ఇటీవల ఫిబ్రవరి 13న నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా మరోసారి ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలోనే ఆమె తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆమెను మృత్యువు కబలించింది. పది రోజుల వ్యవధిలోనే ఆమె కారు రెండు-సార్లు ప్రమాదానికి గురైంది. ఆమె మృతితో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుటుంబంతో పాటు బీఆర్ఎస్ శ్రేణుల్లో విషాదం అలుము కుంది. పార్టీ నేతలు పలువురు ఆమె మృతిపట్ల




తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మా రావు లాస్య మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నవయస్సులోనే మరణిం చడం బాధాకరమన్నారు. కుటుంబసభ్యులకు తన సంతాపం ప్రకటించారు. నందిత మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మె ల్సీ కవిత విచారం వ్యక్తం చేశారు. మృత దే హం సందర్శించి నివాళులర్పించారు. కుటుం బసభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

# మార్చిలో మహాసంగ్రామం

మొదటిపేజీ తరువాయి..

బిహార్, ఉత్తరప్రదేశ్‌లో త్వరలోనే ఈసీ బృందాలు పర్యటించనున్నాయి. మార్చి 13వ తేదీన జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తాయని తెలుస్తోంది. ఓటర్ల సంఖ్యని 97 కోట్లుగా తేల్చి చెప్పింది ఈసీ. వీళ్లంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని వెల్లడించింది 2019తో పోల్చి చూస్తే ఓటర్ల సంఖ్య 6% మేర పెరిగింది. కొద్ది రోజుల క్రితమే ఓటర్ల జాబితాని పబ్లిష్ చేసింది. ఈ సారి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ సాయంతో ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తే వాటిని తొలగించేందుకు ఈ ఏఐ టీమ్ సిద్ధంగా ఉంటుంది. ఇప్పటికే ఇందుకోసం ప్రత్యేకంగా ఓ డివిజన్‌ని ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఇలాంటి పోస్ట్‌లను తొలగించినప్పటికీ పదే పదే వాటిని ప్రచారం చేసినా ఈసీ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆయా పార్టీల సోషల్ మీడియా అకౌంట్‌లను సస్పెండ్ చేస్తామని తేల్చి చెబుతున్నారు.



# తుపాల్!


మొదటిపేజీ తరువాయి..

-1,739 పోస్టులు, లాంగ్వేజ్ పండిట్ - 611 పోస్టులు, పీఈటీ - 164 పోస్టులు ఉన్నాయి. మొత్తం 1,76,530 మంది దరఖాస్తులు సమర్పించారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు అత్యధికంగా 60,190 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఇందులో 1,79,297 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఖాళీల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి.. సుమారు మరో 5 వేల ఖాళీలను కలిపి 11 వేల పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోపు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తు న్నట్లు.. అందుకు తగిన విధంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే.. ప్రత్యేక అవసరాల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్)కు బోధించేందుకు దాదాపు 1,500 స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి డీఎస్సీ నిర్వహణ సజావుగా జరిగేలా న్యాయపర సలహాలు తీసుకొని ముందుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.వచ్చే ఏడాది జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమ-యానికి ఉపాధ్యాయులకు పోస్టింగులు పూర్తయితే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ఆలోగా ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశించినట్టు సమాచారం. అయితే... గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటీఫికేషన్ రద్దు చేస్తే సమస్యలు వస్తాయని విద్యా శాఖ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఇప్ప టికే భర్తీ చేయాలని నిర్ణయించిన 5,089 పోస్టులతో కలిపి అనుబంధ నోటిఫికేష-న్‌ను జారీ చేసే అవకాశం ఉంది. మ-రోవైపు... ఉపాధ్యాయ పదోన్నతులు పూర్త యితే మరో 8,500 వరకు ఖాళీలు ఏర్ప డతాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది. అయితే కోర్టు కేసులతో ఆగిపోయిన ఉ పాధ్యాయ పదోన్నతులకు, డీఎస్సీకి ముడిపెడితే నియామకాలు పూర్తికావనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

# 27 నుంచి గ్యాస్, కరెంట్


మొదటిపేజీ తరువాయి..

తెలిపారు.నీటి ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి గురించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించబోతున్నామని.. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. త్వరలోనే 2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే తీపికబురు చెబుతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలను సకాలంలో అందించేలా, ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు. పరిపాలనను గాడిలో పెడుతున్నామని సీఎం రేవంత్ చెప్పారు. ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా పనిచేస్తున్నామన్నారు. జర్నలిస్టుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే మీడియా అకాడమీ ఛైర్మన్‌ను కూడా నియమిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నిపుణుల సూచనల మేరకు ముందుకెళ్తామన్నారు. మేడారం జాతర కోసం ఆరు వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మహిళలకు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని చెప్పా-రు. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారుమార్చి మొదటివారం నుంచి జారీచేసే విద్యుత్ బిల్లులకు సంబంధించి.. 200యూనిట్లలోపు వాడే అర్హులైన వినియోగదారులకు జీరో బిల్లులు ఇవ్వాలని అధికారులను ఇప్పటికే సీఎం ఆదేశించారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేందుకు వీలుగా విధివిధానాలను సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించిందని.. ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులందరికీ గ్యారంటీలు అందుతాయి. రూ.500కు గ్యాస్ సిలిండర్ అందించే పథకంలో.. 'ప్రభుత్వ సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాకు బదిలీ చేయాలా? లేక ఏజెన్సీలకు




చెల్లించాలా? ఈ క్రమంలో వచ్చే అడ్డంకులు, ఇబ్బందులపై ఇప్పటికే అధ్యయనం పూర్తి చేశారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో కార్డు నంబర్లు, విద్యుత్ కనెక్షన్ నంబర్ల తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయిన వారెవరైనా ఉంటే.. సవరించుకునే అవకాశం ఇవ్వనున్నారు. విద్యుత్ బిల్లుల కలెక్షన్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లన్నింటా ఈ సవరణ ప్రక్రియ చేపట్టనున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## పెళ్లి కోసమే కిడ్నాప్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
హైదరాబాద్‌లో ఓ యువతి కిడ్నాప్ ప్లాన్ బెడిసికొట్టింది. ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న యువకుడిని త్రిష అనే యువతి కిడ్నాప్ చేసిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది. యాంకర్‌ని పెళ్లి చేసుకోవాలనుకున్న త్రిష కిడ్నాప్ చేయించి, బంధించింది. పెళ్లి చేసుకోవాలని ఆరాటపడి.. చివరికి పోలీసులకు చిక్కింది. త్రిష అనే యువతి డిజిటల్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోందని తేలింది. భరత్ మ్యాట్రిమోనీలో ప్రణవ్ ఫోటోలను చూసి ప్రేమలో పడిన త్రిష.. పెళ్లి చేసుకుంటే అతడినే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. డిజిటల్ మార్కెటింగ్ బిజినెస్ నిర్వహిస్తున్న త్రిష అనే యువతి.. యాంకర్ ప్రణవ్‌ను కిడ్నాప్ చేసింది. అయితే ఇదంతా పెళ్లి కోసమేనని పోలీసుల విచారణలో వెల్లడైంది. కళ్ళుగప్పి కిడ్నాప్ చెర నుంచి తప్పించుకున్న ప్రణవ్ పోలీసులను ఆశ్రయించడంతో అసలు డ్రామా బయటపడింది. మ్యాట్రిమోని సైట్‌లో ప్రణవ్ ఫోటో చూసి మనసు పారేసుకుంది. దీంతో అతన్ని కిడ్నాప్ చేసి రూమ్‌లో బంధించింది త్రిష. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చిందని పోలీసులు తెలిపారు. వాస్తవానికి యాంకర్ ప్రణవ్ మ్యాట్రిమోని సైట్‌లో ప్రొఫైల్‌లో ఎలాంటి ఫోటోలు పెట్టుకోలేదు. ప్రణవ్ పేరుతో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి డబ్బులు సంపాదించాలని కొంతమంది కేటుగాళ్లు స్కెచ్ వేశారు. అయితే ఈ క్రమంలోనే ప్రణవ్ ప్రొఫైల్ నిమని నమ్మిన త్రిష.. అతనిపై మనసు పారేసుకుంది. మ్యాట్రిమోని సైట్‌లో నిజంగానే ప్రణవ్ ఐడీ అనుకుని ఇష్టపడ్డ త్రిష అతన్ని పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయింది. అతని కాంటాక్ట్స్ అధారంగా సంప్రదించింది. ఇందుకు ప్రణవ్ ఆమె ప్రపోజల్‌కు నిరాకరించాడు. ఈ క్రమంలోనే అతన్ని కిడ్నాప్ చేసి రూమ్‌లో బంధించింది. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి పెంచింది. ఎలాగోలా ఆమె బారినుంచి బయటపడ్డ ప్రణవ్.. నేరుగా పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కిడ్నాప్ కథ వెలుగులోకి వచ్చింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరపడంతో అసలు యవ్వారం బయటపడింది. ప్రస్తుతం పలు స్టార్టప్ కంపెనీలను త్రిష నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి ప్రణవ్ దెబ్బకు కిడ్నాప్ కేసులో ఇరుక్కుని జైలుపాలయింది.

## మావోయిస్టుల చేతిలో ఇద్దరు హతం

### పోలీసు ఇన్ ఫార్మర్లల పేరిట హత్య



**ఛత్తీస్‌గఢ్ - ప్రభాతసూర్యుడు :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా మావోయిస్టులు రెచ్చిపోయారు. పోలీసు ఇన్ఫార్మర్ అనే ఆరోపణలతో ఇద్దరు గ్రామస్తులను హత్య చేసారు. మృతులు సోడి హంగా(45), మద్వి నందాగా(36)గా గుర్తించారు. గ్రామస్తులిద్దరి హత్యకు పామెడ్ ఏరియా కమిటీ ఆఫ్ మావోయిస్టులు బాధ్యత వహించినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. గ్రామస్తులిద్దరి మృతికి భాజపా ప్రభుత్వమే కారణమని నక్సలైట్లు ఆరోపించారు. ఆ ప్రాంతంలో పోలీసులు ర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# ఇంటగ్రేటెడ్ స్కూల్స్ దిశగా అడుగులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
ఇంటర్ నేషనల్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విద్యా శాఖ అధికారులను అదేశించారు. డా. బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని డిప్యూటి సీఎం కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాలపై విద్యా శాఖ ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యంలో పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ వార్షిక సంవత్సరంలో రూ. 2500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 100 ఎస్సీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు. ఒక్కో రెసిడెన్షియల్ భవనానికి ప్రభుత్వం రూ.25 కోట్లు చొప్పున మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణాలకు గాను బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడ జరిగినందున భవన నిర్మాణాల పనులు త్వరితగతిన ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ పాఠశాలలు వేర్వేరుగా ఉన్నట్టుగా కాకుండా ఇక ముందు నిర్మించే భవనాలు ఒక చోట ఉండే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఎస్సీ, బిసి, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలు ఇంటిగ్రేటెడ్?గా ఒకే చోట నిర్మాణం చేయడం వల్ల స్థల సమస్యను అధిగమించొచ్చని సూచించారు. అదే విధంగా కామన్‌గా అందేటి సౌకర్యాల వల్ల కూడ కొంత అదనపు ప్రయోజనం కల్గుతుందన్నారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు ఒకే చోట ఉండటం వల్ల విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొందించడం వల్ల కుల రహిత సమాజానికి బాటలు వేసిన వారమవుతామన్నారు. అలాగే మిని ఎడ్యుకేషన్ హబ్?గా అభివృద్ధి చేయడానికి బాగుంటుందని వివరించారు. ఎస్సీ, బిసి, మైనార్టీ బాలుర ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను చింతకాని మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం సమీపంలో ఉన్న 10 ఎకరాల స్థలంలో నిర్మాణం చేయనున్నట్టు చెప్పారు. ఎస్సీ, బిసి, మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఎర్రుపాలెం మండల పరిధిలో నిర్మాణం చేయడానికి స్థల ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం జరుగడానికి



కావాల్సిన స్థల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం త్వరగా జరుగడానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్లానింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అబ్దుల్ నదీంను ఆదేశించారు. అనంతరం బెంగళూర్‌కు చెందిన ఆర్కిటెక్ ప్రతినిధులు దేశంలో వివిధ ప్రాంతాల్లో వారు చేపట్టిన ఇంటర్ నేషనల్ మోడల్ పాఠశాలలకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజేటేంషన్‌ను విద్యాశాఖ అధికారుల సమక్ష్యంలో డిప్యూటి సీఎం తిలకించారు. అన్ని హంగులతో అత్యుత్తమ ప్రమాణాలతో 100 రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణాలు ఒకే మోడల్?గా చేపట్టాడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కోచింగ్ సౌకర్యం కోసం నాలేడ్జ్ కేంద్రాలను నియోజకవర్గ కేంద్రాల వారీగా ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటి సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగాల నోటిఫికేషన్లకు జాబ్ క్యాలెండర్ ప్రకటించనున్న నేపథ్యంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు ఆర్థిక వెసలుబాటు కల్పించడానికి ఈకేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. జ్యోతి భా పూలే ప్రజాభవన్ క్షేత్రంగా నియోజకవర్గాల్లోని నాలెడ్జ్ సెంటర్లకు వచ్చే నిరుద్యోగులకు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ ఇప్పించే ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ లక్ష్యం సఫలికృతం కావాడానికి కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను అదేశించారు.



## హుజూరాబాద్‌లో మంత్రి పొన్నం పర్యటన

**కరీంనగర్ - ప్రభాతసూర్యుడు :**
హుజూరాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. అయన స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. తరువాత మంత్రి వీణవంక మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల దర్శనం చేసుకున్నాం. అమ్మవార్ల ఆశీర్వాదం అందరి మీద ఉండాలి. రాబోయే కాలంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవార్లను ప్రార్థించానని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియంతృత్వం కి వ్యతిరేకంగా ప్రజా పాలన ఏర్పడింది. ఈ ప్రజా పాలన కొంత మంది 70 రోజులు కాకముందే ప్రగల్బాలు పలుకుతున్నరు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. ప్రభుత్వం కూలిపోతుందని ఒకడు కులగొడతామని ఒకడు..నీటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆయా ప్రభుత్వాలు 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణ కి చేసింది ఏముంది. మమ్మల్ని ప్రశ్నించే ముందు దళిత ముఖ్యమంత్రి ,డబుల్ బెడ్రూం ,నిరుద్యోగ భృతి అమలు చేశారా. నియంత్రుత్వంతో స్వేచ్ఛ లేకుండా ప్రశ్నించే గొంతు లేకుండా బతికేటువంటి పరిస్థితి లేకుండే. మా ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం ముళ్ళ కంచెలు బద్దలు కొట్టాం. ప్రజలందరికీ ఉపయోగంలో ఉండే విధంగా మా పరిపాలన కొనసాగిస్తున్నామని అన్నారు.



## రాజ్‌గోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కాలని హోమం

**నల్లగొండ - ప్రభాతసూర్యుడు :**
అసెంబ్లీలో గత ప్రభుత్వాలు చేసిన అవినీతి అక్రమ ప్రాజెక్టులపై ప్రజా గొంతుకై ప్రతిపక్షంను నిలదీస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని చీకటి గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు కాంగ్రెస్ నాయకులు. 2023 స్థానిక ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గం నుండి ఘన విజయం సాధించిన నాటి నుండి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా తనదైన శైలిలో వివిధ శాఖల అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించారని అన్నారు.. పల్లెల్లో బెల్ట్ షాపుల నిర్వహణలో యువత మద్యానికి బానిసలే అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో రోడ్డున పడుతున్నారని తెలిసిన వెంటనే ప్రతి పల్లెల్లో బెల్ట్ షాపులు నిర్మూలన చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నారని నల్గొండ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కోమటిరెడ్డి బ్రదర్స్కు పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారని రాష్ట్ర అభివృద్ధి కొరకు రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

# ధరణి.. ఉద్ధరణ!

మొదటిపేజీ తరువాయి..
చేస్తామని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ధరణి సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన కమిటీ మరో కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ నెల 24న ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, పెండింగ్‌కు గల కారణాలు, వాటి పరిష్కారానికి చర్యల గురించి చర్చిస్తారు. నిషేధిత ఆస్తులకు సంబంధించిన సమస్యలు, సెక్షన్ 22 ఎ జాబితాపై చర్చిస్తారు. జాబితాను సరిదిద్దడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. తాత్కాలిక ల్యాండ్ ట్రిబ్యునల్స్ ద్వారా పరిష్కరించబడిన కేసులు, అనుభవాలు, ముందుకు వెళ్లే మార్గాలను సమావేశంలో చర్చిస్తారు. సాదాబైనామా దరఖాస్తుల స్థితిని పరిశీలిస్తారు. ఖీూఖీ/రావబిలిజీతీ మిస్ మ్యాచ్‌కు సంబంధించిన అంశాలపై ఫోకస్ చేస్తారు. ఖీూఖీ చట్టం, వివిధ స్థాయిలలోని రెవెన్యూ అధికారుల పనితీరు, వివిధ అధికారుల మధ్య ముఖ్యంగా




తహశీల్దార్, ఖీఆూ, ఏఅ అధికారాల పంపిణీలో మార్పుల గురించి చర్చిస్తారు. భూమి రిజిస్ట్రేషన్లలో సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తారు. ఇనామ్, జాగీర్ సహా ఇతర చట్టాల కింద భూ వివాదాలు, సమస్యలు, కేసులు, పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించే మార్గాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చిస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూ సమస్యలపై ఫోకస్ చేస్తారు. రెవెన్యూ-అటవీ వివాదాలపై చర్చిస్తారు. ఎండోమెంట్, వక్ఫ్ భూముల సమస్యలపై దృష్టి సారిస్తారు. మెరుగైన భూపరిపాలన కోసం రెవెన్యూ పరిపాలనలో మార్పులపై కూడా కలెక్టర్లతో చర్చించే అవకాశం ఉంది. తెలంగాణలో భూ సమస్యలను పరిష్కరించాలంటే ధరణి సాఫ్ట్‌వేర్‌ను మార్చితే సరిపోదని, చట్టాలను కూడా మార్చాల్సి ఉంటుందని ధరణిపై నియమించిన కమిటీ గతంలో అభిప్రాయపడింది. ధరణి సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి మాడ్యూల్స్ ఎలా పనిచేస్తున్నాయో కమిటీ తెలుసుకుంది. దరఖాస్తు నుంచి పరిష్కారం వరకు ఏయే దశల్లో సాఫ్ట్‌వేర్ ఎలా పనిచేస్తోందో కమిటీ గత సమావేశాల్లో తెలుసుకుంది. బాధ్యతలన్నీ కలెక్టర్లకు అప్పగించడం వల్ల వస్తున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులు, చట్టపరంగా చేయాల్సిన మార్పులపై కమిటీ త్వరలో నిర్ణయం తీసుకోనుందని సమాచారం.

# కరీంనగర్‌లో కారు వర్సెస్ ఖాకీ

మొదటిపేజీ తరువాయి..
పోలీసులకు ఏకరవు పెడుతున్నారు. గులాబీ నేతలకు వత్తాసు పలికిన పోలీసులు, రెవెన్యూ అధికారులతోపాటు దౌర్జన్యాలకు పాల్పడిన నేతలపైనా ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతికి ప్రభుత్వం ఫ్రీహ్యాండ్ ఇచ్చింది. దీంతో వరుసగా కబ్జా నేతల భరతం పడుతున్నారు. కరీంనగర్‌లో పదేళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని గులాబీ నేతలు సాగించిన భూదందాలపై సీపీ ప్రత్యేక దృష్టిపెట్టారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, విచారణకు ప్రత్యేకంగా ఎకనామిక్ అఫెన్స్ వింగ్(ఈవోడబ్ల్యూసిట్) ఏర్పాటు చేశారు. దీనికి ఏసీపీ ర్యాంకు అధికారి నేతృత్వం వహిస్తున్నారు. దీంతో బాధితులకు మరింత ధైర్యం వచ్చింది. స్వేచ్ఛగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తున్నారు. ప్రతీ ఫిర్యాదును స్వీకరిస్తున్న పోలీసులు ఆధారాలు సేకరించి కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. కరీనంగర్ ఎమ్మెల్యే గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. దాదాపు 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటున్నారు. దీంతో ఆయన అండ చూసుకుని కార్పొరేటర్లు, మంత్రి అనుచరులు సామాన్యులను రాచి రంపాన పెట్టారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు తమకు సంబంధం లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించడం లిటిగేషన్ అని ప్రచారం చేయడం, వీలైతే కబ్జా చేయడం లేదంటే సెటిల్‌మెంట్ పేరిట డబ్బులు వసూలు చేయడం చేస్తూ వచ్చారు. అనేక మంది బీఆర్ఎస్ బాధితులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మదన పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే నాడు మంత్రిగా ఉన్న నేత ఫోన్ చేసి తమ వారిని ఏమీ అనొద్దని ఆదేశించేవారు. దీంతో పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కాదు. ఇక కొందరు పోలీసులు అయితే నాటి అధికార పార్టీ నేతలకే వత్తాసు పలికి బాధితులపైనే కేసులు పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. ఇక కార్పొరేటర్లు ఆస్తులు కూడబెట్టుకోవడమే లక్ష్యంగా పనిచేశారు. ప్రజల సేవను గాలికి వదిలేశారు. ఇక ఇళ్లు కట్టుకుంటే కే ట్యాక్స్ కట్టాల్సిందే. లేదంటే రాత్రి బుల్డోజర్లను పంపించి కూల్చివేసేవారు. అయినా పోలీసులు చోద్యం చూసేవారు. ఇందుకోసం కార్పొరేటర్లు ప్రత్యేకంగా గ్యాంగులనె మెయింటేన్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాఫియాగా మారిన బీఆర్ఎస్ నాయకులు, కార్పోరేటర్లు, వారికి అండగా నిలిచిన గ్యాంగులపై సీపీ ఉక్కుపాదం మోపుతున్నారు. సీపీ అభయం ఇవ్వడంతో బీఆర్ఎస్ బాధితులు పోలీసు కార్యాలయానికి క్యూ కడుతున్నారు. రెండు నెలల్లోనే 720 ఫిర్యాదులు వచ్చాయంటే గులాబీ నేతల కబ్జాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఫిర్యాదులును పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు వాటి ఆధారంగా గులాబీ నేతలను వరుసగా కటకటాల వెనుకకు పంపుతున్నారు. ఇప్పటికే ఒక మాజీ ఎంపీటీసీ, ఇద్దరు కార్పొరేటర్ల భర్తలు, ఇద్దరు కార్పొరేటర్లను పోలీసులు అరెస్టు చేశారు. మరో 12 మంది కార్పొరేటర్లపై ఫిర్యాదులు వచ్చాయి. వారిపై ఆధారాల సేకరణలో పోలీసులు ఉన్నారు. స్పష్టమైన సాక్షాలు సేకరించి వారిని కూడా అరెస్టు చేస్తారని తెలుస్తోంది. సివిల్ వివాదాల్లో బెయిల్ సులువుగా వస్తుందనుకున్న నిందితులకు సీపీ మహంతి నిద్రపట్టనివ్వడం



లేదు. డాక్యుమెంట్లు, సరైనా సాక్షాధారాలను సేకరించిన తర్వాతనే అరెస్టు చేస్తున్నారు. మరోవైపు విచారణలో ఏ విషయం కూడా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గులాబీ నేతలకు వత్తాసు పలికిన పోలీసులను సైతం డీజీపీ కార్యాలయానికి సరెండర్ చేస్తున్నారు. ఆధారాలు పక్కాగా సేకరిస్తుండడంతో నేతలు 14 రోజులు జైలుకు వెళ్లక తప్పడం లేదు. దీంతో ఆందోళనకు గురవుతున్న కొందరు కార్పొరేటర్లు గతంలో తాము కబ్జా చేసిన భూములు యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఫిర్యాదు చేయకుండా చూసుకుంటున్నారు. ఇప్పటికే ఇచ్చిన ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బతిమిలాడుతున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## జాతర లో ప్రత్యేక ఆకర్షణగా కోయ దొరలు



**మేడారం, ప్రభాతసూర్యుడు :** మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర కు దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.జాతర సందర్భంగా మేడారం పరిసరాలు జన సందోహం తో నిండిపోయాయి. కోట్లాది మంది భక్తులు కొంగు బంగారం అయిన సమ్మక్క సారలమ్మ జాతర లో కోయ దొరలు ప్రత్యేక ఆకర్షణగా లుస్తున్నారు.దట్టమైన అడవులలో దొరికే అనేక రకాల వనమూలికల మొక్కలు ,వేర్లు,చెట్ల కొమ్మలను తీసుకు వచ్చి జాతరకు వచ్చే భక్తులకు విక్రయిస్తున్నారు..తాము ఆదివాసిలం అని అడవులలో జీవిస్తూ సమ్మక్క సారలమ్మల ఉపవాస దీక్ష చేపట్టి నిష్ఠతో పూజలు నిర్వహించి అన్ని రోగాలకు సంబంధించిన మూలికలను తమ పూర్వీకుల నుండి తెలుసుకొని నేటికీ అదే కొనసాగిస్తూ ఎంతో మంది ప్రజలకు నయం చేసినట్లు చెబుతున్నారు.భక్తుల నమ్మకానికి అనుగుణంగా వారి వారి రోగాలు నయం అవుతాయని కోయ దొరలు జ్యోతిష్యం తో వారి జాతకం నిజమవుతుందనీ కొందరు భక్తులు తెలిపారు.

# సంపాదకీయమ్..

## భవిష్యత్ అంతా ఏఐదే

కృత్రిమ మేథ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్. దీని ప్రభావం ప్రపంచంపై బాగానే పడుతోంది. ఇప్పుడిప్పుడే.. ప్రవేశిస్తున్న ఈ అత్యంత అధునాతన సాంకేతిక వ్యవస్థ ఇప్పటికే చాలా రంగాల్లోకి ప్రవేశించింది. రాబోయే కాలమంతా దీనిదే అంటున్నాయి సర్వేసంస్థలు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్ వంటి వాటిలో రానున్న మూడేళ్ల కాలంలో అంటే 2027 నాటికి భారీగా వృద్ధి చెందుతుందని నాస్కామ్ అంచనా వేసింది. సాధారణంగా కృత్రిమ మేథ అంటే.. ఇటీవల కాలంలోకొంత ఆందోళనలు చోటు చేసుకున్నాయి. దీనివల్ల ఊడిపోతున్న ఉద్యోగాలు సహా మనిషి కన్నా.. 100 రెట్లు ఎక్కువగా ఆలోచన చేస్తుందని.. ఫలితంగా ఇది చెడుకు దారితీస్తుందని మేధావులు సైతం చెప్పుకొచ్చారు. అయితే.. ఏ వ్యవస్థలో అయినా.. మంచి, చెడు రెండు ఉంటాయి. ఇప్పుడు కృత్రిమ మేథలోనూ ఈ రెండు ఉన్నాయనే చెబుతున్నారు. కృత్రిమ మేథ ఆధారిత సేవల మార్కెట్ భారత్ ఏటా 25-35% వృద్ధిని సాధిస్తుందని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా 2027 నాటికి ఏఐ మార్కెట్ దేశీయంగా 17 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.41 లక్షల కోట్ల) స్థాయికి చేరుతుందని వివరించింది. టెక్నాలజీ బడ్జెట్ కేటాయింపులు పెరగడం, మానవ వనరుల లభ్యత, ఏఐ సేవలకు ప్రాధాన్యం పెరుగుతుందని విశ్లేషించింది. 'ఏఐ పవర్డ్ టెక్ సర్వీసెస్' పేరుతో ఈ నివేదికను కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన బీసీజీతో కలిసి నాస్కామ్ ఆవిష్కరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ రంగంలోకి పెట్టుబడులు ఏటా 24% పెరుగుతున్నాయి. 2023లో 83 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.89 లక్షల కోట్ల) పెట్టుబడులను ఈ రంగం ఆకర్షించింది. ప్రధానంగా డేటా అనలిటిక్స్, జెన్ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఆల్గోరిథమ్ అండ్ ప్లాట్‌ఫామ్స్ విభాగాల్లోకి అధికంగా పెట్టుబడులు వస్తున్నాయి. మనదేశంలో ఐటీ కంపెనీలు డిజిటల్ కంటెంట్, డేటా అనలిటిక్స్ సప్లై చైన్ రంగాలకు నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నాయి. కొన్ని కంపెనీలు కేవలం ఏఐని వినియోగించడమే కాదు.. తమ సేవల తీరును సరికొత్తగా మారుస్తున్నాయి. మన దేశంలో 4.2 లక్షల మంది ఏఐ నిపుణులు ఉన్నారు. ఏటా ఈ నిపుణుల సంఖ్య పెరుగుతోంది. ఈ విషయంలో ప్రపంచంలోని అగ్రశ్రేణి-5 దేశాల జాబితాలో మనదేశం ఒకటి. ఏఐపై పెట్టుబడులు పెరుగుతున్నందున, ఏఐ నిపుణుల అవసరాలు పెరుగుతాయని నాస్కామ్ వెల్లడించింది.

ఏఐ వల్ల ఉద్యోగాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కొంత మంది మాత్రం ఏఐను సరిగ్గా నిర్వహిస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏఐపై పెద్దస్థాయిలో పరిశోధనలు సాగుతున్నాయి. కానీ ఇటీవల ఓ వార్త మాత్రం ఏఐ వల్ల కలిగే నష్టాలను వివరిస్తుంది. ముఖ్యంగా ఏఐను నియంత్రించే అవకాశం మానవులకు ఉండదని, అదే జరిగితే మానవ మనుగడకే ఏఐ వల్ల ముప్పు సంభవిస్తుందని పేర్కొంటున్నారు. ప్రఖ్యాత ఏఐ భద్రతా నిపుణుడు డాక్టర్ రోమన్ వీ యాంపోలిస్కీ తన రాబోయే పుస్తకం ఏఐ అన్ఎక్స్‌పాండబుల్, అన్ ప్రిడిక్టబుల్, అన్ కంట్రోలబుల్ అనే పుస్తకంలో ఏఐ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ పుస్తకం కృత్రిమ మేధస్సు ద్వారా ఎదురయ్యే సంభావ్య ప్రమాదాల గురించి తెలియజేస్తుంది. ప్రస్తుత సాంకేతికత దాని సురక్షితమైన, నైతిక ఉపయోగాన్ని నిర్ధారించడానికి రక్షణగా లేదని డాక్టర్ యాంపోలిస్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాంపోలిస్కీ రచించిన పుస్తకంలో ఏఐ వల్ల కలిగే నష్టాలను ఓ సారి తెలుసుకుందాం.డాక్టర్ యాంపోలిస్కీ ఏఐకు సంబంధించిన విస్తృతమైన పరిశోధన ఈ పుస్తకంలో ప్రచురించారు. మానవ సామర్థ్యాలను అధిగమించిన తర్వాత సూపర్-ఇంటెలిజెంట్ ఏఐను మనం నియంత్రించగలమనే కచ్చితమైన రుజువు లేదని పేర్కొంటున్నారు. ఈ "అస్తిత్వ ముప్పు" అతను దానిని పిలుస్తున్నట్లుగా పెద్దదిగా ఉంది. తనిఖీ చేయకుండా వదిలేస్తే వినాశకరమైన పరిణామాలకు అవకాశం ఉంది. ఈ పుస్తకంలో ఏఐకు సంబంధించిన స్వయం ప్రతిపత్తి, అనూహ్యత ద్వారా ఎదురయ్యే స్వాభావిక సవాళ్లను వివరించారు. ఈ ఫీచర్లు అపారమైన సామర్థ్యాన్ని అందిస్తున్నప్పుడు ఏఐ మానవ నియంత్రణలో ఉందని నిర్ధారించడం కష్టతరం చేస్తుందని పేర్కొంటున్నారు. డాక్టర్ యాంపోలిస్కీ సందేశం స్పష్టంగా, అత్యవసరంగా ఉందని పలువురు టెక్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బలమైన ఏఐ భద్రతా చర్యలను అభివృద్ధి చేయాలని కూడా సూచిస్తున్నారు. ఏఐ వ్యవస్థలను తనిఖీ చేయని స్వయంప్రతిపత్తితో పనిచేయడానికి అనుమతించే ముందు మానవ నియంత్రణ, అవగాహనకు ప్రాధాన్యతనిచ్చే సమతుల్య విధానం అమలు చేయాలని యాంపోలిస్కీ చెబుతున్నారు. ముఖ్యంగా ఏఐను మానవాళి ఎదుర్కోబేయే అతి ముఖ్యమైన సమస్యగా చాలామంది భావించవచ్చని ఆయన పేర్కొంటున్నారు. అయితే ఏఐ పెరుగుదల అనేది ప్రపంచంలో కొత్త సమస్యలకు కారణమవుతుందని చెబుతున్నారు.

# సమ్మక్కకు తీరని సర్కారు మొక్కు!

- జాతర సమయంలోనే జ్ఞాపకం
- బంగారం మొక్కుకు రక్షణ కరువు
- ప్రతిపాదనల్లోనే కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు
- వచ్చే జాతరకైనా మొక్కు తీరేనా..?



**వరంగల్, ప్రభాతసూర్యుడు :** సమ్మక్క-సారలమ్మకు భక్తులకు సమర్పించే ఎత్తు బంగారాన్ని గద్దెల వద్దకు సురక్షితంగా చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కన్వేయర్ బెల్ట్ ప్రతిపాదన మాటలకే పరిమితమైంది. తమ ఎత్తు బంగారం తల్లుల చెంతకు చేరాలనే ఉద్దేశంతో భక్తులు దూరం నుంచే బెల్లం బుట్టలు గద్దెల మీదకు విసరుతుండగా.. అక్కడున్న సిబ్బంది, మిగతా భక్తులకు దెబ్బలు తగులుతున్నాయి. కొబ్బరికాయలతో తలలు పగిలే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతోనే ప్రభుత్వం కన్వేయర్ బెల్ట్ ప్రతిపాదన తీసుకొచ్చినా కొన్నేళ్లుగా దానికి మోక్షం కలగడం లేదు. ఫలితంగా గద్దెల ప్రాంతంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎత్తు బెల్లం దెబ్బలు తప్పడం లేదు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన ప్రభుత్వ పెద్దలు, ప్రముఖులకు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మేడారం జాతర అంటేనే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది తరలివచ్చే మహా పండుగ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఎంతోమంది వచ్చిన సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకునే వేడుక. ఇక్కడ అమ్మవార్లకు ఎత్తు బంగారం పేరున బెల్లాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతోనే సమ్మక్క?సారలమ్మకు మొక్కుకున్న మేరకు భక్తులు చాలావరకు తమ బరువుతో సమానంగా బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పిస్తుంటారు. భక్తి శ్రద్ధలతో తీసుకొచ్చిన బెల్లం గద్దెల మీదకు చేరినప్పుడు తమ మొక్కు తీరినట్టుగా భావిస్తుంటారు. ఈ మేరకు తీసుకొచ్చిన ఎత్తు బంగారాన్ని గద్దెల మీద పెట్టేందుకు ప్రయత్నం చేస్తుంటారు. కానీ అక్కడ రష్ వల్ల బెల్లం బుట్టాలు సమ్మక్క గద్దెల వద్దకు వెళ్లి పెట్టలేని పరిస్థితి నెలకొంటుంది. దీంతోనే భక్తులు దూరం నుంచే బెల్లం బుట్టాలు, కొబ్బరికాయలు విసురుతుంటారు. ఇదిలాఉంటే గద్దెల ప్రాంతంలో ఎప్పటికప్పుడు భక్తులు సమర్పించే బెల్లం, ఒడిబియ్యం, పసుపు, కుంకుమలు, గాజులు, కొబ్బరికాయలను తరలించేందుకు సిబ్బంది పని చేస్తుండగా.. భక్తులు విసిరే బెల్లంతో సిబ్బంది గాయపడిన సందర్భాలు చాలానేఉన్నాయిఎత్తు బంగారాన్ని సమర్పించేందుకు భక్తులు కిలో సైజు నుంచి రూ.25 కిలోల బుట్టాలను కూడా తీసుకొస్తుంటారు. క్యూ లైన్లలో వాటిని తలపై ఎత్తుకుని దర్శనం పూర్తయ్యేంతవరకు మోస్తుంటారు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురవడంతో పాటు బరువుతో ఇబ్బందులు తలెత్తేవి.

దీంతోనే ఈసారి జాతరకు రూ.80 లక్షలతో కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. భక్తులు తీసుకొచ్చే ఎత్తు బంగారాన్ని కన్వేయర్ బెల్ట్ లో పెడితే అదే నేరుగా బెల్లాన్ని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు చేరుతుందని భావించారు. కానీ అదికాస్త మాటలకే పరిమితమైంది. కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయకపోవడంతో సమస్య అలాగే కొనసాగుతోంది.బెల్లం బుట్టాలతో పాటు కొబ్బరికాయలను గద్దెల వద్దకు విసురుతుండటంతో అక్కడ పని చేసే పోలీస్, శానిటేషన్ సిబ్బందికి హెల్మెట్స్, సేఫ్ గార్డ్స్ ఇచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఎవరైనా ప్రముఖులు దర్శనానికి వచ్చిన సమయంలో వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వైపు పైనుంచి వచ్చే బెల్లం బుట్టాలను తప్పించుకునేందుకు హెల్మెట్స్, గార్డ్స్ వాడటంతో పాటు గద్దెల దర్శనానికి వచ్చిన ప్రముఖులనూ ప్రొటెక్ట్ చేసేందుకు రక్షణ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.

తాజాగా రాష్ట్ర మంత్రి సీతక్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శనకు వచ్చిన సమయంలో కూడా ఇదే సమస్య ఎదురైంది. వారు అమ్మవార్లను దర్శించుకోవడానికి గద్దెల వద్దకు చేరుకోగా.. వారికి దెబ్బలు తగలకుండా సేఫ్ గార్డ్స్ అడ్డుపెట్టి రక్షణ కల్పించారు. కాగా ప్రతిసారి జాతర ముందు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేయడం, ఆ తరువాత షరా మామూలే అన్నట్టుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. ఈ సంవత్సరం కూడా ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ ఆ పనులకు అడుగులు పడలేదు. కాగా ప్రతిసారి జాతర ముందు హడావుడి చేయడం తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా మేడారం మహాజాతరకు ముందస్తుగా పనులు చేపట్టి, జాతర ప్రారంభానికి కొంత ముందుగానే కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రారంభించాలని సిబ్బందితో పాటు భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## బైజూస్‌కు ఆగని కష్టాలు




**ముంబై, ప్రభాతసూర్యుడు :** భారతీయ స్టార్టప్ రంగానికి పోస్టర్ బాయ్‌గా నిలిచిన బైజూస్‌కు సమస్యలు రోజురోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతున్న ఈ ఎడ్‌టెక్ స్టార్టప్ కంపెనీ, ఇప్పుడు తన కార్యాలయాలను మూసేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది, బెంగళూరు నుంచి ప్రారంభమైంది.బైజూస్, తన ఖర్చులు తగ్గించుకోవడానికి కార్యాలయ స్థలాన్ని తగ్గించడం ప్రారంభించింది. బెంగళూరులోని ప్రెస్టీజ్ టెక్ పార్క్‌లో ఉన్న 4 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని ఈ కంపెనీ ఇటీవలే ఖాళీ చేసింది. ఈ కార్యాలయ స్థలం లీజు ఈ సంవత్సరం ప్రారంభంలో రద్దయింది. బకాయి ఉన్న అద్దెను డిపాజిట్ ఉపయోగించి చెల్లిస్తున్నారు. ఇంకా, కొన్ని ఆస్తులకు సంబంధించి సంబంధిత యజమాన్యాలతో వివాదం నడుస్తోందని ఈటీ రిపోర్ట్ చేసింది.బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ , బెంగళూరులో ఉన్న ప్రాపర్టీని మూడున్నరేళ్ల క్రితం ప్రెస్టీజ్ గ్రూప్ నుంచి లీజుకు తీసుకుంది. ఈ కార్యాలయ స్థలం కోసం ప్రతి నెలా రూ. 4 కోట్ల అద్దె చెల్లిస్తోంది.

ప్రస్తుతం కంపెనీ ఆర్థిక పరిస్థితి అతి భారీగా క్షీణించడం వల్ల, కొన్ని ఆఫీసుల అద్దెలను సకాలంలో చెల్లించలేకపోతోంది.బెంగళూరులోనే ఉన్న మరో ఆఫీస్ స్పేస్‌పైనా సమస్యలు కమ్ముకున్నాయి. ఇది కళ్యాణి టెక్ పార్క్‌లో, 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. కళ్యాణి డెవలపర్స్ నుంచి ఈ స్థలాన్ని బైజూస్ లీజుకు తీసుకుంది. బైజూస్ గత 10 నెలలుగా ఈ ఆస్తికి అద్దె చెల్లించలేదు. దీంతో, కళ్యాణి డెవలపర్స్, బైజూస్ డిపాజిట్ నుంచి 7 నెలల అద్దెను తీసుకుంది. అంతేకాదు, బైజూస్‌కి లీగల్ నోటీస్ పంపింది.నిధుల విషయంలో బైజూస్‌కు కొంత ఉపశమనం లభించింది. ఇటీవల, ఈ కంపెనీ రైట్స్ ఇష్యూ ప్రారంభించింది. ఈ నెలాఖరులో ఈ ఆఫర్ క్లోజ్ అవుతుంది. బైజూస్, రైట్స్ ఇష్యూ ద్వారా వివిధ పెట్టుబడిదార్ల నుంచి 300 మిలియన్ డాలర్ల వరకు కమిట్‌మెంట్స్ పొందింది. ఈ ఇష్యూ నుంచి 200 మిలియన్ డాలర్లు సేకరించాలన్నది కంపెనీ ప్రయత్నం. దీని కోసం, బైజూస్, తన కంపెనీ విలువను 99 శాతం కుదించి, 220-250 మిలియన్ డాలర్లకు తగ్గించింది. ఈ విలువ ఒకప్పుడు 22 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ బ్లాక్‌రాక్, ఈ ఏడాది జనవరిలో, బైజూస్ విలువను 1 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. బ్లాక్‌రాక్‌కు బైజూస్‌లో వాటా ఉంది. తన వాటా విలువను లెక్కగడుతూ, బైజూస్ విలువ కేవలం 1 బిలియన్ డాలర్లుగా బ్లాక్‌రాక్ అంచనా వేసింది. 2023 మార్చిలోనూ బైజూస్ విలువలో కోత పెట్టింది. అప్పుడు, సంస్థ విలువను 8.4 బిలియన్ డాలర్లకు కుదిస్తున్నట్లు అమెరికా ఔఇఅకి సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. దీనికిముందు, 2022 డిసెంబర్‌లో, 11.5 బిలియన్ డాలర్లకు కుదించింది. తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న బైజూస్, ఫిబ్రవరి ప్రారంభమైన 4 రోజుల తర్వాత గానీ తన ఉద్యోగులకు జనవరి నెల జీతాలు చెల్లించలేకపోయింది. ఎంతో ప్రయత్నం చేస్తేగానీ జీతాలు ఇవ్వలేకపోయినట్లు బైజూస్ అఖా రవీంద్రన్ స్వయంగా చెప్పడం కంపెనీ కష్టాలకు అద్దం పడుతోంది. ఉద్యోగుల జీతాల కోసం ఈ కంపెనీ నెలకు దాదాపు రూ.70 కోట్లు వెచ్చిస్తోంది. అఖా రవీంద్రన్‌ను కుర్చీ నుంచి దింపేందుకు బైజూస్ ఇన్వెస్టర్లంతా ఏకమయ్యారంటూ ఇటీవల జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై బైజూస్ స్పందించింది, ఇన్వెస్టర్లకు అలాంటి హక్కు లేదని స్పష్టం చేసింది.




## తెలంగాణలో ఐదుగురు ఐఏఎస్‌లు బదిలీ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మరోసారి పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది రేవంత్ సర్కార్. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేశారు. సిద్ధిపేట నూతన కలెక్టర్ గా కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని నియమించారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను జనగాం కలెక్టర్‌గా బదిలీ చేశారు. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుత పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను అదనంగా అప్పగించింది. ఇంతకాలం ఆ బాధ్యతలు అదనపు హోదాలో చూస్తున్న సునీల్ శర్మను అక్కడి నుంచి రిలీవ్ చేసింది రాష్ట్ర సర్కార్. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో భారీగా బదిలీలు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న వారికి ప్రభుత్వం స్థాన చలనం కలిగిస్తోంది. వేర్వేరు స్థానాలకు బదిలీ చేస్తోంది. ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ బదిలీలు సంభవిస్తుంటాయి. ఇటీవల డీఎస్పీలను కూడా పూర్తి స్థాయిలో మార్చారు. దీనికి కొనసాగింపుగా ఎక్సైజ్ శాఖలో బదిలీలకు పూనుకుంది ప్రభుత్వం. ముమ్మందు ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల బదిలీలు కూడా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణం



**నిర్మల్ - ప్రభాతసూర్యుడు :** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న సంగారెడ్డి జిల్లా దవ్వూరు గ్రామానికి చెందిన తెనుగు శిరీష(18) గురువారం రాత్రి హాస్టల్లో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని కళాశాల సిబ్బంది తెలిపారు. చదువుల తల్లి బాసర జ్ఞాన సరస్వతి క్షేత్రంలో నెలకొన్న బాసర ట్రిపుల్ ఐటీలో ఎప్పుడు ఏదో ఒక కారణం వలన విద్యార్థుల బలిదానాలు ఆత్మహత్యలు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుతం ఆత్మహత్య చేసుకున్న శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. వ్యక్తిగత సమస్య వల్లనే ఆత్మహత్య చేసుకుందని అధికారులు చెబుతున్నారు. ఆత్మహత్యల నివారణకు క్యాంపస్ లో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటాలేరని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్లో వెళ్ళకుండా మీడియా పై ఆంక్షలు విధించారు. విద్యార్థులు, మీడియాతో మాట్లాడితే నిజ నిజాలు తెలుస్తాయి. క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయని అన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215